# కొరుకొండ సత్యానంద్



# కళ్ళు

అర్పణ తన గదిలో వాలుకుర్చీలో కూర్చొని ఉంది....

ఆమె గుండె బరువెక్కిపోయి ఉంది....

'వాళ్ళు' వెళ్ళిపోయాక తన గది లోకి వచ్చి ఏదో పుస్తకం చదువు కుంటున్నట్లుగా ఉండిపోయింది.... ఆమె తనలో తనే అనుకుంటుంది, ఏవేవో ఆలోచిస్తుంది.... తల్లి ఒకటి రెండు సార్లు మాట్లాడదామని అనుకుంది గానీ, తను సీరియస్‌గా చదువుకుంటుంటే చూసి వెళ్ళిపోయింది....

అర్పణ చదువుకుంటున్నప్పుడు ఎవ్వరూ ఆమెను డిస్టర్బ్ చేయడానికి ప్రయత్నించరు....

కానీ, అర్పణ చేతిలో విప్పిఉన్న ఆ పుస్తకం కేవలం అలంకారప్రాయంగా, అవకాశానికి ఆసరాగా మాత్రమే ఉంది .... ఆ పుస్తకాన్ని ఆమె చదవడం లేదు....

'అతని' మాటలే ఆమె చెవుల్లో గింగుర్లు పెడుతున్నాయి.... ఆ మాటలు ఆమెను బాధపెట్టకపోలేదు గానీ, చాలా ఆశ్చర్యచకితురాల్ని కూడా చేసాయి....

ఆమె ఆలోచనలు అతని చుట్టూనే తిరుగుతున్నాయి.... ఎంత ఆలోచించినా అతనెందుకు అలా అన్నాడో ఆమెకు అర్థంకావడంలేదు....

అర్పణ ఇప్పుడు డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది.... డిగ్రీ అయిపోయిన వెంటనే ఆమెకు వివాహం చేసెయ్యా లన్న ఉద్దేశంతో తండ్రి పెళ్ళి సంబంధాల్ని తీసుకురావడం మొదలుపెట్టాడు .... ఇంతకుముందు వచ్చిన రెండు సంబంధాలూ ఇంట్లో ఎవ్వరికీ నచ్చలేదు.

"మీరేమంటే అనండి గానీ, నాకీ సంబంధం బొత్తిగా నచ్చలేదు" అనేది తల్లి....

"నాకు మాత్రం నచ్చిందని నీకు చెప్పేనా ఏమిటి?" అనేవాడు తండ్రి....

"అయితే ఎందుకు తీసుకువచ్చినట్టు?"

"దారిలో మనం ఓ తీగెకోసం వెదుకుతున్నప్పుడు, మరింకెన్నో తీగెలు తగుల్తుంటాయి శాంతా! అబ్బాయితో సహా ఫలానా రోజున వస్తామని అన్నప్పుడు, మనం కూడా అబ్బాయిని చూడనప్పుడు.... రండి, అనక ఇంకేం అంటామే? ఇప్పుడు నచ్చలేదనుకో! కదలక మెదలక మరో సంబంధం చూసుకోవడమే!"

తండ్రి చెప్పే సమాధానం చలాకీగా, నవ్వొచ్చేట్టుగా ఉంటుంది అర్పణకు....

కానీ, సాయంత్రం వచ్చిన సంబంధం.... 'అతను' నచ్చాడు అర్పణకు....

గుండ్రని ముఖం.... ఉంగరాల తల.... విశాలమైన నేత్రాలు, వాటిలో అదో రకం భావం.... ఎత్తుగా, అందంగా, ఆకర్షణీయంగా ఉన్నాడు అతను....

అతను తండ్రిని 'అలా' అడిగేసరికి అర్పణ గుండె 'ఝల్లు'మంది.... ఏదో వివరంగా చెప్పలేని భయంలాటి భావన కలిగింది ఆమెకు....

"దానికేముంది బాబూ? ఇందులో తప్పేముంది అభ్యంతరం చెప్పడానికి?" అని అతనడిగినదానికి తండ్రి ఒప్పుకున్నప్పుడు అర్పణ కాళ్ళు వణికేయి ఎందుకో!

అయినా తప్పలేదు....

తండ్రి చెప్పినమీదట తడబడుతున్న అడుగులతో వెళ్ళి తన గదిలో.... అక్కడ.... నుంచొంది అర్పణ.... ఒక నిముషంలో అతను వచ్చాడు....

అతను గొంతు సవరించుకున్నాడు....

ఒకవైపు సిగ్గు, మరోవైపు భయం అర్పణను ఆవహించాయి....

"ఈ అవకాశాన్నిచ్చినందుకు చాలా థాంక్స్! నేనేమీ మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయను.... నేను చెప్పింది వినండి

చాలు.... సహకరిస్తే అదే నాకు పది వేలు...."

అతని కంఠం మెత్తగా ఉంది....

"............"

"నా పేరు చక్రవర్తి.... మీరు చాలా అందంగా ఉన్నారు...."

అర్పణకు సిగ్గేసినట్లయ్యింది....

"మీరు చదువుకున్నవారు, అందమైన వారు.... మిమ్మల్ని పెళ్ళిచేసుకోవడం, ఆ చేసుకున్నవాడి అదృష్టం...."

అర్పణకు అతని ధోరణి అర్థంగాక భృకుటి చిన్నగా ముడిచి, కొంచెం తల పైకెత్తి చూసింది....

"నేను మీకు నచ్చానా?" అర్పణ కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు అదోలా.... అనుమానంగా....

ఒకప్రక్క సిగ్గు మొగ్గలేసినా, ఒక ప్రక్క ఆలోచిస్తుంది ఇతని ఈ మాటలకు అర్థం ఏమిటా అని....

'నచ్చారు' అన్నట్లుగా నెమ్మదిగా తలూపింది....

"అయితే మీరు నాకో సహాయం చెయ్యాలి...."

ఏమిటన్నట్లుగా ఈసారి పూర్తిగా తలెత్తి చూసింది....

"నేను మీకు నచ్చలేదని మీ ఇంట్లో వాళ్ళకు గట్టిగా చెప్పాలి!"

"అసలు అలా చెప్పడం దేనికి?" వణుకుతున్న పెదవుల్ని అతి కష్టం మీద కదిలించి అడగగలిగింది....

"అలా చెప్తే మీరు నాకు ఎంతో సహాయం చేసినవారౌతారు.... నా అన్వేషణకు అడ్డురానివారౌతారు...."

మళ్ళీ ఏదో అడగబోయింది అర్పణ .... కానీ, అతను అక్కడినుండి కదలి వెళ్ళిపోయాడు....

నిర్విణ్ణురాలై చూస్తూ ఉండిపోయింది అర్పణ.... ఆమె కేమీ అర్థంకాలేదు....

బయటకు వెళ్ళిన అతను మామూలుగానే నవ్వుతూ ఉన్నాడు వెళ్ళిపోయే వరకూ....

"ఏమ్మా? ఏమిటలా కూర్చుండిపోయావ్? బట్టలుకూడా మార్చుకోలేదు" అని అడుగుతూ వచ్చింది తల్లి.... అర్పణ చేతిలోని పుస్తకం జారిపోయి, ఒడిలో పడిపోయి ఉండడంవల్ల అవకాశం దొరికిన ఆమె వచ్చి అడిగింది....

ఆలోచిస్తున్న అర్పణ ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది.... తల్లి వచ్చి ప్రక్కనున్న కుర్చీలో కూర్చొని "అబ్బాయి బాగున్నాడు కదే?" అని ఆనందంగా, ఆత్రంగా అంది....

తల్లివైపు నిర్లిప్తంగా చూసింది అర్పణ....

తల్లికంటే ఎక్కువ ఆశే ఉన్నది అర్పణకు.... కానీ....

"ఏమ్మా? అలా ఉన్నావేం! ఆ అబ్బాయి గదిలో ఏమైనా అన్నాడా?"

"ఊ...."

"ఏమన్నాడు?"

"........ నేను నచ్చాననే."

తల్లి ముఖంలో ఆ క్షణంలో ఆనం దపు వరద వస్తున్నట్లు కన్పించింది అర్పణకు....

"నువ్వేమైనా మాట్లాడావా?"

"....లేదు...."

"ఏమైనా మాట్లాడలేకపోయావా?"

"మాట్లాడేదాన్నే.... కానీ...."

"కానీ?.... ఏమిటమ్మా?"

"....అతను నాకు నచ్చలేదు...."

తల్లి ఆనందం అంతా ఒక్కసారిగా అణగారిపోయింది ఆ సమాధానంతో....

అక్కడ కాస్త రసాభాస జరిగింది.... ఆ వార్త ఇంట్లో వాళ్ళందర్నీ ఆశ్చర్య చకితుల్ని చేసింది.... ఎన్నో ప్రశ్నలు వచ్చాయి.... కొన్నింటికి సమాధానం చెప్పింది.... కొన్నింటికి నిర్లిప్తంగా ఊరుకుంది.... ఆఖరుకు తన అభి ప్రాయం అదే అంది.... 'వాళ్ళ కలా చెప్పండి.... అలా చెప్పలేకపోతే, ఎలా గోలా చెప్పండి.... ఎలా చెప్పినా, అతను నాకు భర్త కాకుండా ఉండాలి.... చెప్పక తప్పదు' అంది.... ఆమె మాటలు ఇంట్లోవాళ్ళకు ఏమీ అర్థంకాలేదు.... ఒక్కతే కూతురు.... ఒక్కతే చెల్లెలు .... ఏమీ అనలేకపోయా రెవ్వరూ....

ఆగని ఆమె ఆలోచనల్లో.... ఏమిటితని మాటల్లోని అర్థం?.... అన్వే షణ.... ఏమిటది? దేనికోసం?.... అతన్ని కలుసుకుంటే? విషయం ఏమిటో తెలుసుకుంటే?.... లాంటివి ఎన్నో ఉన్నాయి....

ఇంట్లోవాళ్ళ దగ్గర్నుండి ఆ అడ్రస్సు ఎలాగైనా సంపాదించొచ్చు.... కానీ, ఈ మహానగరంలో అక్కడికి వెళ్తే.... ఆ ఇంటి పరిస్థితులు ఏమిటో, ఎలా ఉంటాయో అని ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది....

అలా ఎందుకు చేయాలో తెలుసుకో లేకపోయినా, అతని కోరిక ప్రకారం అతనికి సహాయం చేసానన్న తృప్తి మాత్రం మిగుల్చుకుంది అపర్ణ....

## 2

అర్పణ ఎదురుచూస్తున్న బస్సు వచ్చి బస్టాపు దగ్గర ఆగింది.... దిగే వాళ్ళు దిగుతున్నారు.... అందరూ దిగ డం అయిపోయిం తర్వాత అర్పణ బస్సెక్కబోతూ ఒక్కసారి తల ప్రక్కకు త్రిప్పి చూసింది....

బస్సు వెనుకనుండి.... అతను.... చక్రవర్తి.... దిగుతూ కన్పించాడు....

బస్సెక్కబోయిన అర్పణ ఆ ప్రయ త్నాన్ని విరమించుకుంది....

బస్సు వెళ్ళిపోయింది.... చక్రవర్తి వెళ్ళిపోతున్నాడు....

అర్పణ వేగంగా నడిచి చక్రవర్తిని చేరుకుంది....

"....ఎక్స్‌క్యూజ్ మీ...."

తల త్రిప్పి చూసాడు చక్రవర్తి....



అర్పణ.... తడబడినట్లయ్యాడు....

"బాగున్నారా?" అని అడిగింది చనువుగా అర్పణ....

"ఆఁ...."

"రండి.... అలా పార్కులోకి వెళ్ళి కూర్చుందాం...."

"నేను రాను.... సారీ" అనాలనుకున్నాడు చక్రవర్తి.... కానీ ఎందుకో అనలేకపోయాడు....

"రండి.... ప్లీజ్...."

అర్పణను అనుసరించాడు చక్రవర్తి.

పార్కులో ఒకచోట కూర్చుంటూ.... "మీరూ కూర్చోండి" అంది అర్పణ....

అక్కడ ఎవ్వరూ లేరు.... చక్రవర్తి కూర్చున్నాడు....

ఒక నిముషం ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు.... తరువాత అర్పణే అంది....

"కబురందిందా?"

"అఁ.... చాలా థాంక్స్!"

"....ఎందుకు?"

"నాకు సహాయం చేసినందుకు...."

"అదే, ఎందుకని అడుగుతున్నాను..."

చక్రవర్తి తటపటాయించాడు.... "సారీ, నేను చెప్పలేను...." అని లేవబోయాడు....

అర్పణ అతని చేతిని పట్టుకుంది.... వింతగా చూసాడు అర్పణవైపు....

"కూర్చోండి, ప్లీజ్!"

"కూర్చుంటాను.... నన్నేమీ అడగకుంటే" అంటూ కూర్చున్నాడు.... అతని చేతిని వదిలేసింది....

"అందుకే, మిమ్మల్ని చూసి బస్సెక్కేదాన్నల్లా ఆగిపోయాను.... మీ దగ్గరకు వచ్చాను.... ఇంతవరకూ తీసుకొచ్చాను...."

"తెలుసుకోవడం అవసరమా?"

"అవసరంకాదు.... అయినా తెలుసుకోవాలని ఉంది...."

"అంటే... నన్నేడిపించాలని ఉందా?"

"ఏడవడం దేనికి? ఆడపిల్లలాగ...." చిన్నగా నవ్వుతూ అంది....

"ఆడపిల్లలే ఏడవాలా?"

"ఆడపిల్లలే ఏడుస్తారు.... బేలలు కాబట్టి"

"దురదృష్టవంతులు కూడా ఏడుస్తారు...."

"మీ అదృష్టానికేం వచ్చింది? బాగా ఉన్నవారేనని విన్నాను...."

"లేనిది లేదు.... ఒక్క కోరకున్నది తప్ప!" అతని కంఠంలో వింత మార్పు కన్పించింది....

"ఏమిటి?"

"ప్రేమ!" చటుక్కున అనేసి తల దించుకున్నాడు చక్రవర్తి....

ఒక్క క్షణం అర్పణ కూడా ఏమీ మాట్లాడలేకపోయింది.... ఆమెకు అతని సమాధానం పూర్తిగా అర్థంకాలేదు....

"....మీ సమాధానం నాకు అర్థం కాలేదు...."

"అక్కరలేదు.... మీరు చాలా తెలివైనవారు...."

"దేనికి?"

"మీ మాటల్తో నా చేత నేను చెప్పగూడదనుకున్నవి చెప్పిస్తున్నారు...."

"ఏం చెప్పారిప్పుడు?"

"నా సర్వస్వాన్ని"

"నా కసలు ఏమీ అర్థం కావడం లేదు...."

"ప్లీజ్! నే వెళ్ళిపోతాను.... లెట్ మీ గో!" మళ్ళీ లేవబోయాడు....

"ఇట్సాల్ రైట్! కానీ, మిమ్మల్ని చూసాక మీకు నిండు హృదయం, సంస్కారం ఉన్నాయన్పించింది.... నాకు మీరే కావాలని కూడా అన్పించింది.... కానీ, గదిలో మీ మాటలు విన్నాక మిమ్మల్ని త్యాగంచెయ్యక తప్పలేదు.. నా త్యాగాన్ని గుర్తించక్కరలేదు.... కానీ, మీ కోరికమీద మిమ్మల్ని కాదన్న

నాకు కనీసం మీలో ఉన్నదేమిటో చెప్పొచ్చుగా?"

లేవబోయిన అతను మళ్ళీ కూర్చు న్నాడు.... తలదించుకొని క్రిందనున్న గడ్డిపూవును పట్టుకొని చూస్తూ.... ఒక్క క్షణం తర్వాత అతనే అన్నాడు...

"....చెప్తాను.... చెప్పడమంటే మరోసారి ప్రేమను చంపడమన్నమాట .... అయినా మిమ్మల్ని బాధపెట్టలేను.... చెప్పింది విన్నాక చాలా చిన్న విషయం అనుకుంటారు.... నన్నో పిచ్చివాడుగా జమకట్టేస్తారు...."

"ఆ అనుమానం మీ కక్కరలేదు.... నే నర్థంచేసుకోగలను.... చెప్పండి.... మీరు దేనికోసం నన్నలా అబద్ధమాడ మన్నారు?...."

"....ప్రేమ.... కోసం!" అతను తలెత్తాడు....

తెల్లగా మల్లెపూవుల్లా ఉండే అతని కళ్ళు ఇప్పుడు ఎర్రగా మారిపోయాయి .... ఆ కళ్ళనిండా కన్నీళ్ళు ఉన్నాయి....

ఒళ్ళు జలదరించింది అర్పణకు.... తన చేతిలోఉన్న కర్చీఫ్ అందించింది.... చక్రవర్తి దాంతో కళ్ళను తుడుచు కున్నాడు....

అతను గుండెలోని బరువును తగ్గించుకోడానికి ప్రయత్నిస్తున్నట్లుగా ఉన్నాడు.... ఎలా మొదలుపెట్టాలా అని ఆలోచిస్తున్నట్టుగా ఉన్నాడు....

అర్పణ అతనేం చెప్తాడా అని కుతూ హలంగా ఎదురుచూస్తోంది....

అతని పెదవులు కదిలాయి నెమ్మ దిగా....

"....ప్రేమను నేను ప్రేమించాను... గాఢంగా!"

విషయం అర్థమయింది అర్పణకు....

"....మీరు చాలా సహాయం చేసారు .... అందుకే మీ మాట కాదనలేక వచ్చానిక్కడికి.... అయినా ఈ ప్రదే శంలో నా ప్రేమ, నేను కలిసి ఎంతో కాలాన్ని ఎంతో హాయిగా గడిపాం! అందుకే నాకు కన్నీళ్ళు ఆగలేదు...."

"....ఆమెను పెళ్ళిచేసుకోడానికి మీ ఇంట్లో ఒప్పుకోలేదా?"

"ఇంట్లోవాళ్ళకు తెలియదు.... తెలి సినా నా ఇష్టాన్ని కాదనరు...."

"అయితే ఏం జరిగింది మీ మధ్య?"

"అన్యాయం...."

"కాస్త అర్థమయ్యేట్లు చెప్పండి...."

"చెప్పడానికి ఏమీ లేదు.... నా ప్రేమ నాకు దూరమైపోయింది.... నేనే దూరం చేసుకున్నాను.... ఒక విధంగా ఆమెను నేను హత్యచేసాను...."

"హత్యా?" ఉలిక్కిపడినట్లు అడిగింది అర్పణ....

"....కంగారు పడకండి.... నాకు స్కూటరు తొక్కడం అంటే సరదా! ఫీట్సు చేయడం అంటే ఎంతో ఇష్టం.... ఆ రోజు నేను, నా ప్రేమ బీచ్‌కు బయల్దేరాం.... జోరుగా, హుషారుగా

స్కూటరు నడుపుతున్నాను పీట్సు చేస్తూ .... ప్రేమ పకపకా నవ్వుతూంది.... ఆ నవ్వే అప్పుడు నా ఊపిరి.... నిర్మానుష్యంగా ఉన్న ఆ రోడ్డుమీద నేను స్కూటర్ని చాలా జోరుగా పోనిచ్చాను .... చేతులు వదిలేసాను.... కాళ్ళను సీటుమీద పెట్టాను.... ఆ క్షణం మమ్మల్ని చూసి ఓర్వలేకపోయింది.... కాలం కళ్ళెర్రజేసింది.... అంతే!"

చక్రవర్తి ఇక చెప్పలేనట్లు ఆగిపోయాడు.... భారంగా నిట్టూర్చాడు....

"ఏమైంది?" అని అడగడానికి ధైర్యం చాల్లేదు అర్పణకి.

ఒక క్షణం తర్వాత చక్రవర్తే చెప్పాడు.... "స్కూటరు ఎత్తుగా గోడలా పేర్చిన రాళ్ళగుట్ట ప్రక్కనుండి పోయింది.... ప్రేమ భయంతో నన్ను గట్టిగా పట్టుకుంది.... స్పీడుగా పరుగెడుతున్న స్కూటరు క్రింద ఏదో పడినట్లు గుర్తు.... తర్వాత మా మీద రాళ్ళగుట్ట బలంగా ఒరిగిపోయినట్టు గుర్తు.... తర్వాత.... ఏమైందో, ఏమో తెలియలేదు.... కళ్ళు తెరిచేసరికి హాస్పటల్లో ఉన్నాను.... ప్రేమ గుర్తొచ్చి, జరిగింది గుర్తొచ్చి, కంగారుగా చుట్టూ చూసాను.... నా ప్రక్క బెడ్ మీదే ప్రేమ ఉంది.... మా దగ్గర నా తల్లిదండ్రులు, ఆమె తల్లిదండ్రులూ ఉన్నారు.... నా తల్లిదండ్రుల కళ్ళల్లో నీళ్ళు రెండ్రోజుల వరకూ ఆగలేదు.... రెండ్రోజుల్లో నేను కొద్దిగా కోలుకున్నాను.... అప్పటినుండి ఇప్పటి వరకూ ప్రేమ తల్లిదండ్రుల కళ్ళల్లో కన్నీరు కారుతూనే ఉంది.... నా గుండె పగిలిపోతూనే ఉంది....

"అంటే.... ప్రేమ...."

"అవును.... ఎవ్వరూ ఏ డాక్టరూ, ఏ దేవుడూ నా ప్రేమకు ప్రాణం పోయలేకపోయారు...."

ఒక్క నిముషంపాటు అర్పణ నిరుత్తరయై అలా ఉండిపోయింది చక్రవర్తివైపు చూస్తూ.... చక్రవర్తి కళ్ళల్లో కన్నీటిధార....

"సారీ! మిమ్మల్ని బాధపెట్టాను...."

"నో! ఏమీలేదు.... నే నెప్పుడూ బాధపడుతూనే ఉంటాను...."

అర్పణ తర్వాత ఏమీ అనలేదు.... ఏదోఆలోచిస్తున్నట్టుగాఉండిపోయింది... చక్రవర్తి ఆమెను గమనిస్తూన్నాడు.... కొంతసేపు గడిచాక.... "మీకూ చాలా అనుమానాలు కలుగుతున్నాయి కదూ!?" అన్నాడు....

"దేనికి!"

"....ప్రేమమీద ఇంత ప్రేమను పెంచుకున్న ఇతను ఇంకా బ్రతికి ఉన్నాదేమిటి? అని.... బ్రతికిఉండి పెళ్ళి చూపులకు వెళ్తున్నాదేమిటి, పెళ్ళి ఎందుకు చేసుకుంటున్నాడు అని! అవునా?"

అర్పణ ఏమీ అనలేదు.... కానీ

ఆమె కళ్ళు అవునన్నట్టు, సమాధానం కావాలన్నట్లు ఉన్నాయి....

"....ఆ రోజు.... నా ప్రేమ దూరమైపోయినరోజు.... కొద్దిగా కోలుకున్న నన్ను దగ్గరకు రమ్మంది........

* * *

ప్రేమ శరీరమంతా కట్లు.... తల మీద కట్లు....

చక్రవర్తి ప్రేమ దగ్గరకు వెళ్ళాడు... అతనికి ఏడుపు ఆగలేదు.... అతి కష్టం మీద ఆపుకున్నాడు....

"చక్రా! బాధపడుతున్నావా"

"....లేదు.... సిగ్గుపడుతున్నాను.... నిన్నీస్థితికి...."

ప్రేమ అతని నోటిని తనచేత్తో మూయబోయింది.... కానీ, చేతికి తగిలిన గాయం ఆమెను బాధకు గురిచేసింది.... 'అమ్మా!' అని బాధతో మూలిగింది....

చక్రవర్తికి కళ్ళల్లోంచి వస్తున్న కన్నీరు ఎంత ఆపుకుందామన్నా ఆగ లేదు....

"ఏడుస్తున్నావా చక్రా?"

సమాధానం రాలేదు అతనినుండి.... అతని గొంతు పూడుకుపోయింది.... ఒక్క నిముషం ఇద్దరూ ఇద్దరి కళ్ళల్లోకి చూసుకున్నారు.... ఆ రెండుజతల కళ్ళల్లో కన్నీటి పొరలు.... ఆ పొరల్లో ప్రేమ, అరాధనలు పొంగుతున్నాయి....

"చక్రా! నిన్నొకటి అడుగుతాను....

"అడుగు ప్రేమా! నా ప్రాణం కావాలా?"

శుష్కంగా నవ్వింది ప్రేమ....

"పిచ్చి చక్రా! నా కోరిక తీరుస్తావా!"

"చెప్పు ప్రేమా! నీవేది కోరితే అది చేస్తాను.... దాన్ని తెస్తాను...."

ప్రేమకు ఆయాసం వస్తోంది.... ఆయాసాన్ని ఆపుకుంటూ.... "చక్రా! నేను.... నేను.... పోతే నువ్వు పెళ్ళి చేసుకుంటావా?"

ఉలిక్కిపడ్డాడు చక్రవర్తి....

"నో ....నో ... అవేం మాటలు ప్రేమా? నీ కెందుకీ ఆలోచన వచ్చింది? నీవు నా దానివి.... నిన్ను నేను దూరం చేసుకుంటానా?" చక్రవర్తి గొంతు జీర బోయింది....

"నువ్వు చేసుకోలేవు చక్రా! కానీ, నాకు అనుమానంగా ఉంది.... నా బ్రతుకుమీద.... కానీ, నా కోరికను కాలదన్నకు చక్రా.... నేను పోతే నువ్వు.... నువ్వు.... ఏ అఘాయిత్యమూ చేయవు కదూ? నీ తల్లిదండ్రులకు నువ్వొక్కడివే.... వాళ్ళ దగ్గర నువ్వు బాధపడుతూ ఉండగూడదు.... మరో అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలి.... తప్ప కుండా చేసుకుంటావు కదూ? అప్పుడే నీ ప్రేమకు నీవు న్యాయం చేసినవాడివి అవుతావు.... నా ప్రేమకు విలువనిచ్చిన వాడివౌతావు.... నా మీద ఒట్టుపెట్టి చెప్పు చక్రా!"

* * *

"....ఒట్టుపెట్టి చెప్పేవరకూ ప్రేమ నన్నేమీ మాట్లాడ నీయలేదు.... ఒట్టు పెట్టి చెప్పాను, నేను బ్రతికే ఉంటా నని.... పెళ్ళికూడా చేసుకుంటానని.... తర్వాత, నా కళ్ళల్లోకి ప్రేమగా, ఆరాధ నగా అలాగే చూస్తూ ప్రాణాలు విడి చింది నా ప్రేమ...."

ఊపిరి బిగబెట్టి అలకిస్తోంది అర్పణ.

"....నాకు పిచ్చిపట్టినట్లయ్యింది.... నా ప్రేమకు చిచ్చుపెట్టిన స్కూటరును పెట్రోలు పోసి కాల్చేసాను.... నా ప్రేమ ప్రాణాలు తీసిన నేను చచ్చి పోదామని ప్రయత్నాలు చేసాను.... కానీ, ప్రేమకు ఇచ్చిన మాట.... ఒట్టు పెట్టి చెప్పినమాట.... ఆ ఒట్టుతో మరలా నా ప్రేమను చంపుకోలేక పోయాను.... నా తల్లిదండ్రులు నా కోసం, నే నేమైపోతానోనని ఇరవై నాలుగ్గంటలూ నన్నంటిపెట్టుకొనే ఉండి పోయారు....

"కాలంకరిగిపోతుంది....ఇంట్లోవాళ్ళ ఒత్తిడి పెరిగింది.... ప్రేమ నాకు గుర్తుకువస్తూంది.... హుం.... అసలు మరచిపోతే కదా, గుర్తుకు రావడానికి... ఆమె మాటలు నా కిప్పటికీ విన్పిస్తూనే ఉన్నాయి....

"నన్ను నేను సమర్ధించుకుంటున్నానో లేక జీవితంతో రాజీపడుతున్నానో నాకు తెలియడంలేదు.... నా ప్రేమను ఆకర్షణో, వ్యామోహమో అవి అను కుంటే నేను సహించలేను.... ప్రేమను కాల్చేస్తున్న ఆ చితిమంటల్లోకి గెంతే యాలని ఎంత ప్రయత్నించానో, అప్పటి నా ఉద్వేగాన్ని ఎవరు శంకించినా అప్పుడు నేను చచ్చిపోకుండా ఆపిన వాళ్ళమీద కసి పెంచుకుంటాను....

"మొదటిసారి బలవంతంమీద పెళ్ళి చూపులకువచ్చి మిమ్మల్ని చూసిన దగ్గ ర్నుండి నా కనిపిస్తుంది, నేను తప్పు చేస్తున్నానేమోనని.... కాని, తప్పు దేమో?.... మీరు నాకు చాలా సహాయం చేసారు....

అతనింకేమీ చెప్పలేదు.... చాలా చెప్పాలని ఉన్నా ఎలా వ్యక్తపరచాలో, ఏమిటో తెలియక తికమక పడుతున్న వాడిలా అయిపోతున్నాడు....

ఆ పరిస్థితిని అర్థం చేసుకుంది. అర్పణ....

చాలాసేపు మౌనంగా ఉండిపోయా రిద్దరు....

చీకటి పడుతోంది.... పార్కులో లైట్లు వెలిగాయి.

"....నన్ను చూసివచ్చింతర్వాత.... అసలు పెళ్ళే చేసుకోగూడదని అనుకు న్నారా?"

అతని మాటలు విన్నాక.... అతను ఏం చేద్దామనుకున్నాడో తెలియక అడి గింది అర్పణ.

"లేదు.... నా ప్రేమ తలమీద చేయి పెట్టి చెప్పాను.... ఒకసారి చేతులారా

చంపుకున్నా నా ప్రేమను మళ్ళీ చంపుకోలేను...."

"....అయితే, నేను మీకు తగనా?".

చిన్నగా, బాధగా నవ్వాడు చక్రవర్తి.

"సారీ! నేను మిమ్మల్ని బాధపెడుతున్నందు.... నా అభిప్రాయం అదికాదు ....మీరు నాకు పనికిరారని, తగరని కాదు ....మీకిప్పటికి తెలిసే ఉంటుంది....నేను పిచ్చివాడ్ననీ, సెంటిమెంటల్ ఫూల్ననీ... కానీ, నాకు అందులోనే ఎంతో ఆనందం ఉంది.... అది అందరికీ తెలీదు."

"మరెవ్వరినైనా పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నారా?"

"అవును.... చేసుకుంటాను.... కానీ, ఇంకా ఎవరో తెలీదు...."

"అంటే?" ఏమీ అర్థంగాక అడిగింది అర్పణ....

"చెప్పానుకదండీ, నేనో సెంటిమెంటల్ క్రీచర్నని....నేనో రకం మనిషిని....... నా ప్రేమను మీరు చూసి ఉండరు.... నా గదిలో ఒకే ఒక దేవత... ఆ ఫొటోలో ఎప్పుడూ నవ్వుతూ ఉంటుంది నా ప్రేమ దేవత— ఆ ఫొటో అందరికీ కన్పించదు.... నా ప్రేమ ఎలా ఉంటుందో తెలుసా? అందంగా, నాజూగ్గా.... మెత్తని స్వరం చిన్న నవ్వు.... చక్కని కళ్ళు.... ఆ కళ్ళే మీ అనుమానాలకూ, నా అన్వేషణకూ కారణం.... మీకు అర్థమై ఉండదు.... ఆ కళ్ళు అందరికీ ఉండవు.... నా అభిరుచి ఎవ్వరికీ ఉండదేమో? అందుకే నా స్నేహితులు నన్ను చూసి నవ్వుకొనేవారు.... పిచ్చివాడిగా జమకట్టేసారెప్పుడో! ఇప్పుడైతే ఎవ్వరూ నాతో మాట్లాడరు ... నేను కూడా ఎవ్వరితోనూ మాట్లాడను.... ఈ విషయంలో నేనెప్పుడూ వాళ్ళను లెక్కచేయలేదు.... నా ప్రేమ కళ్ళు అందరిలాంటి కళ్ళు కాదు.... అవి నల్లగా ఉండవు.... తెల్లగా ఉంటాయి.... గాజుకళ్ళల్లా మెరుస్తాయి.... నా వైపు ప్రేమగా చూస్తాయి.... పలకరిస్తాయి. ఆ తెల్లని కళ్ళకు నా మిత్రుడొకసారి ఒక పేరు పెట్టి నన్ను గేలిచేసాడు.... వాడ్ని చితకబాదేసానా రోజు.... ఇంకెప్పుడూ వాడు నా దగ్గరకు రాలేదు.... అలా అంటున్నప్పుడు అతనికి విపరీతమైన కోపం వచ్చింది....

అలసిపోయాడు....

అయినా చెప్పడం ఆపలేదు.... ఆవేశంగా, ఏదో ఉద్వేగంతో చెప్తున్నాడు....

"ప్రేమించిన ప్రేమను నా సొంతం చేసుకోలేకపోయాను.... వెళ్ళిపోతున్న ప్రేమ వెంట నేనూ వెళ్ళలేకపోయాను .... అందుకు ఆమె పెద్ద అడ్డు పెట్టేసింది.... నన్ను బలంగా ఆపేసింది.... పైగా నన్ను జీవించమంది.... మరొకరికి జీవితాన్ని పంచివ్వమంది.... ఎవరికి? ఎవరికి పంచివ్వాలి? నా జీవితం పెద్ద విలువైనది కాకపోయినా, మన

స్ఫూర్తిగా నా జీవితాన్ని పంచివ్వాలంటే నా ప్రేమకు సమానమైనవారెవ్వరు నా దృష్టిలో? ఆలోచించి, ఆలోచించి నేనో నిర్ణయాని కొచ్చాను.... నా ప్రేమ కోరికను తీర్చాలన్నా, నేను మరొకరిని మనసారా ఆహ్వానించానన్న తృప్తి నాలో మిగలాలన్నా, ఆమెకు.... నా ప్రేమకు ఉండే తెల్లని కళ్ళు.... గాజు కళ్ళు ఉండాలి.... ఉండక తప్పదు.... అప్పుడే నాకు తృప్తి.... సంతృప్తి...."

అతను మాట్లాడ్డం ఆపలేదు.... మాట మాటకీ అతనిలో ఉద్వేగం పొంగిపోతోంది.... మనిషి ఊగిపోతున్నాడు.

అతనివైపు వింతగా చూస్తుండిపోయింది అర్పణ....

"....నా వాళ్ళకు చెప్తే నవ్వుతారు.... వాళ్ళల్లో ఎంత సహనం ఉన్నా నన్ను తిడతారు, విసుక్కుంటారు.... అది నాకు తెలుసు.... అందుకే చెప్పలేదు.... చెప్పను కూడా! అయినా ఒక విషయం చెప్పాను వాళ్ళకు.... నే నిప్పుడప్పుడే పెళ్ళి చేసుకోను, నాకు నచ్చిన అమ్మాయి దొరికితే తప్పకుండా మీతో చెప్పే చేసుకుంటాను.... ఇంకే పెళ్ళి చూపులకూ రాను, అని! ఏమో, వాళ్ళేమీ అనలేదు.... ఆ కళ్ళకోసం అన్వేషిస్తాను.... జీవితం అంతా వెతుకుతాను.... లోకం అంతా తిరుగుతాను...."

"మరి పెళ్ళిచేసుకున్నా మీరు ఆ అమ్మాయిని సుఖపెట్టగలరా?" అడ్డు ప్రశ్న వేసింది అర్పణ.

అతను నవ్వాడు.... ఎందుకో, అదోలా....

"ప్రేమ కోరిక తీర్చడం నా ధ్యేయం.... ఆమె కోరికను నేను గౌరవించాను.... ఆమె కోరికే నా కాబోయే భార్య.... అప్పుడు నా భార్యను గౌరవించలేనా? ప్రేమించలేనా? నా ప్రేమ బ్రతికిందనుకుంటాను.... లేకపోతే, ఆమె నా ప్రేమ ఇచ్చిన వరం అనుకుంటాను.... ఆమె కోరికను తీర్చడంలో నాకు సంతృప్తి కలుగుతుంది.... ఆ సంతృప్తే నా క్రొత్త జీవితం.... ఆ సంతృప్తిలో ఎవర్నీ బాధపెట్టను.... నేను నచ్చుకున్న కళ్ళనుండి ఒక్కకన్నీటిబొట్టు రాలినా నేను సహించగలనా? నేను పిచ్చివాడ్ని, సెంటిమెంటల్ క్రీచర్ని గానీ.... దుర్మార్గుడ్ని కాదండీ...."


అతను పూర్తిగా అలసిపోయాడు.... ఆయాసంతో ఒగరుస్తున్నాడు....

అక్కడున్న చెట్టుకి జారగిలబడిపోయి కళ్ళుమూసుకున్నా డతను....

అర్పణ అతనివైపే రెప్ప ఆర్పకుండా చూస్తోంది....

ఇతను గొప్ప మనిషా? వింత మనిషా?

మనుషుల్లో ఎన్నో రకాలు....ఇతనో రకం మనిషి.... అప్పుడప్పుడూ, అక్కడక్కడా కన్పించే, అందరిచే హర్షించ




బడని, మెప్పును పొందలేని ప్రేమికుడు.... నా మట్టుకు మాత్రం ఇతను గొప్ప ప్రేమికుడే: గొప్ప మనిషే!

ఆమె మీద ప్రేమ ఉంది.... ఆమె మాట మీద గౌరవం ఉంది.... ఆమె లేని ఈ లోకాన్ని విడిచి పెట్టి పోవాలని ఉంది.... ఆమె కళ్ళు మళ్ళీ కన్పిస్తే ఆ కళ్ళల్లో తన ప్రేమను చూసుకోవాలని ఉంది.

ఇతన్నెంతమంది అర్థంచేసుకోగలరు? నేను మాత్రం ఇతన్ని సరిగ్గానే అర్థంచేసుకుంటున్నానేమో?

ఆతని గురించి అలా ఏవేవో అనుకుంటున్న అర్పణకు మెదడులో ఓ ఆలోచన మెరిసింది_

అతన్ని ఒక విషయం అడగాలనుకుంది.... కానీ, అతను కళ్ళు మూసుకొని ఉన్నాడు.... అతని ముఖంలో భావాలు పరిశీలించడానికి ప్రయత్నించింది.... కానీ, అది ఆమె తరం కాలేదు....

ఒక నిముషం గడిచింది....

అర్పణ గొంతు సవరించుకొంది, అతనికి విన్పించేలా!

అతను కళ్ళు తెరచి చూసాడు....

"మిమ్మల్నో ప్రశ్న అడగాలని ఉంది.... అడగమంటారా?"

"అడగండి చెప్తాను...." ఏ ప్రశ్నకైనా నేను జవాబు చెప్పగలను అన్నట్లుగా చూసాడు అతను....

"మరోలా అనుకోరు కదా, కోపం తెచ్చుకోరు కదా?"

"నో.... అడగండి...."

"మీకు ప్రేమ కళ్ళంటే అంత ఇష్టం కదా? అటువంటప్పుడు వాటిని ఆమెతోపాటే బూడిద చేసేసారా?"

అతను ఒక్క నిముషం ఆగాడు.... ఎటో చూసాడు.... గతంలోకేమో!? తరువాత నవ్వాడు.... నెమ్మదిగా, బాధగా....

"ప్రయత్నించాను.... తీవ్రంగా! కానీ, ఎవ్వరూ నన్ను అర్థంచేసుకోలేదు .... కోపం తెచ్చుకున్నారు ప్రేమ తల్లి దండ్రులు.... నా తల్లిదండ్రులు నా భవిష్యత్తుకోసం బెదరిపోయాను.... మొత్తానికి అందరూ ఆ కళ్ళను బూడిద చేయడానికే గట్టిగా ప్రయత్నించారు.... అప్పుడు నా ప్రేమ చితిదగ్గర పిచ్చి వాడిలా అరిచాను.... భోరున ఏడ్చాను గానీ, అంతకంటే ఏమీ చేయలేక పోయాను.... అందరూ కలసి నన్నుశ త్రుద్ని చేసి నన్నేడిపించారు.... ఏమి? అని అడిగితే నా కోసం, నా జీవితం కోసం, నా మానసిక బలంకోసం అన్నారు.... మావాళ్ళు బెంబేలు పడి పోయారు నేను పిచ్చివాడినై పోతానేమో నని.... హుఁ! పిచ్చివాళ్ళు!"

అతని నవ్వులో విన్పించిన బాధ తీవ్రతకు అర్పణ చలించిపోయింది....

"....అయితే నేను దురదృష్టవంతు రాల్నన్నమాట...."

ఆ మాట విన్న చక్రవర్తి ఒక్క సారిగా అటు తిరిగి వింతగా చూసాడు ఆమెవైపు.... ఆమె తల దించుకొని ఉంది....

"ఏమిటన్నారు....? మీరు దురదృష్ట వంతులా? ఏమిటి మీ మాటకు అర్థం ఏమిటి?"

అర్పణ తలెత్తి చక్రవర్తివైపు చూసింది.... చక్రవర్తి కూడా సమా ధానంకోసం చూస్తున్నాడు ఆమెవైపు.... ఆమె లేచి నిలబడింది.... చక్రవర్తి కూడా మంత్రముగ్ధుడ్లా లేచి నిలబడ్డాడు....

ఆమె తలదించుకొని కాస్త వెనగ్గా ఉన్న చక్రవర్తివైపు ఓరగా చూస్తూ.... "ఆ కళ్ళు ఉండిఉంటే నా కళ్ళ స్థానంలో ఆ కళ్ళను అమర్చుకొనేదాన్ని!" అని అక్కడినుండి కదిలిపోయింది....

వాడిగా ఉన్న కరవాలంతో తన గుండెను సర్రున కోసేసినట్లయ్యింది, ఆ మాట విన్న చక్రవర్తికి....

అతనక్కడినుండి కదల్లేకపోయాడు ....అక్కడున్న చెట్టుకు జారగిలపడి పోయాడు.... ఆమె వెళ్ళినవైపే చూస్తూ ఉండిపోయాడు....

అతని చేతిలో ఇందాక అర్పణ ఇచ్చిన 'కర్చీఫ్' నలుగుతూంది....

—